అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 19 అక్టోబర్ 2025 | పేజీలు : 04

ఉద్యమంలా స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

జెండా ఊపి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు, కార్మికులను సన్మానించిన దృశ్యం

- పాల్గొన్న అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

కూడేరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. అక్టోబర్ నెల థీమ్ క్లీన్ ఎయిర్ (గాలి నాణ్యతను పెంచుదాం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకుందాం)తో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ముందుగా కడదరకుంట రోడ్డులోని భగవతి ఫంక్షన్ హాల్ నుంచి మెయిన్ రోడ్డు వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎంపీ, జిల్లా కలెక్టర్ ప్రారంభించి.. విద్యార్థినీ విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కారు. అనంతరం మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీ, జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఇక్కడ వర్మీకంపోస్టు తయారు చేయాలని, అమ్మకాలు చేపట్టాలని, నిత్యం నీరు పెట్టాలని, నాడర్ ఫిట్స్‌ను ఉపయోగించాలని వారు ఆదేశించారు. తదనంతరం అక్కడే ఎంపీ, కలెక్టర్ మొక్కలు నాటారు. తదనంతరం ఎంపిడిఓ కార్యాలయం ఆవరణంలో మానవహారం, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఆ తరువాత అక్కడే మొక్కలు నాటి, సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యుత్ ఎస్ఈ కార్యాలయం డిఈఈ రామకృష్ణ మాట్లాడుతూ.. పీఎం సూర్య ఘర్ యోజన పథకం, పీఎం కుసుమ్ పథకం కింద కలిగే లబ్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో గొప్ప మనసుతో మొదలుపెట్టి నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో స్వచ్ఛభారత్ మిషన్‌లో ఆంధ్రప్రదేశ్ ఈ సంవత్సరం మొట్టమొదటి స్థానంలో రావడం అనేది ఎంతో గర్వ కారణం అని, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణలో రాష్ట్రంలో అనంతపురం జిల్లా మొదటి స్థానంలో నిలవడం ఎంతో గొప్పదని, ఇది జిల్లా కలెక్టర్, అధికారుల పనితనాన్ని గుర్తుచేస్తుందన్నారు. అనంత పురం వెనుకబడిన జిల్లా కాదని, అవకాశం ఇస్తే అద్భు తాలు సృష్టిస్తామనేది స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్య క్రమం నిర్వహణతో అందరికీ చూపించగలిగా మన్నారు. ఈ కార్యక్రమం అమలుతో పరిసరాలు బాగుండాలని, అప్పుడే సమాజం బాగుంటుందని, సమాజం బాగుంటే రాష్ట్రం బాగుంటుందని, దాని ద్వారా దేశం బాగుంటుం దనే ఆలోచనతో పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఉద్యమంలా ఈ కార్య క్రమాన్ని చేపడుతున్నామన్నారు. మన ఆరోగ్యం మన ఇంట్లో ఉందని, మన ఇళ్లను మనం శుభ్ర పరుచు కోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కాలుష్యం లేని బ్యాగులను వాడాలని, ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటుకోవాల న్నారు. చెట్లు పెంచే కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టాలని, ఇందులో ప్రతి ఒక్కరూ సైనికులుగా పనిచేయాలన్నారు. పీఎం సూర్య ఘర్ యోజన పథకం కింద లబ్ధి చేకూర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. ఈ పథకం కింద ప్రతి ఒక్కరు లబ్ధి పొందాలని, దీనిపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తో మాట్లాడామని, పెన్నఅహోబిలంలో త్వరలోనే చెట్లు నాటే ఒక ప్రాజెక్టును తీసుకురాబోతున్నా మన్నారు. సేవాగడ్ లో మొక్కలు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని

మిగతా 4లో...

ప్రజలపై బాదుడు తప్పదా..?

- రెండు రోజులకే ఒక్కొక్క షాపుకు రూ.లక్ష ఖర్చు
- లబోదిబోమంటున్న టపాసుల లైసెన్స్ విక్రయదారులు

అనంతపురం అక్టోబరు 18 ప్రభాతవార్త

అధికారుల నిర్లక్ష్యం.. రెండు రోజులే గడువు.. ఒక్కొక్క షాపుకు రూ.లక్ష ఖర్చు.. ఈ భారమంతా ప్రజలపై బాదడం తప్పా వేరే గత్యంతరం లేని దుస్థితి.. ఇదండీ మనం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే దీపావళికి అధికారయంత్రాంగం నగరవాసులకు ఇచ్చిన బహుమతి.. వివరాల్లోకి వెళితే.. ప్రతి ఏటా దీపావళి పండుగ సందర్భంగా టపాసులు విక్రయించేందుకు అధికారయంత్రాంగం లైసెన్స్‌లు అందజేయడం ఆనవాయితీ. ఈ తరుణంలో ఈ దీపావళి పండగకు కూడా షాపుల నిర్వహించేవారు లైసెన్స్‌లకు దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ లైసెన్స్ తీసుకోవడానికి ఒక్కొక్క షాపుకు లక్షరూపాయలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. అయితే ఇంత ఖర్చు చేసుకున్నా, టపాసులు విక్రయించడానికి కేవలం రెండు రోజులు కూడా అవకాశంలేని దుస్థితి నెలకొంది. ఎందుకంటే సోమవారం దీపావళి పండుగ వుండగా హడావిడిగా అధికారయంత్రాంగం శనివారం స్థానిక క్రిష్ణకళామందిరంలో లైసెన్స్ దారులతో అత్యవసర సమావేశం నిర్వహించి నిబంధనలు ప్రకారం విక్రయాలు చేయాలని సూచించారు. అదేవిధంగా లైసెన్స్‌లు కూడా శనివారం రాత్రి వరకు సంబంధిత అధికార కార్యాలయంలో జారీ చేశారు. ఈ లైసెన్స్ దారులు విక్రయాలు చేసుకోవడానికి ప్రతి ఏటా కేటాయిస్తున్న సవేరా ఆసుపత్రి సమీపంలోనే స్థలం కేటాయించి తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి షాపులకు లాటరీల ద్వారా నంబర్లు కేటాయించేశారు. అయితే వీరందరూ ఆ షాపులకు వెళ్లి కనీస వసతులు ఏర్పాటు చేసుకుని అందులో టపాసులు వుంచి నగర ప్రజలకు విక్రయించడానికి ఆదివారం మధ్యాహ్నం వరకు సమయం పడుతుంది. అంటే సోమవారం రాత్రి దీపావళి పండుగ చేసుకోవాలంటే నగరవాసులు ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం సాయంత్రం వరకు టపాసులు కొనుగోలు చేయాల్సింటుంది. దీనిని బట్టి కేవలం ఒకటిన్న రోజు విక్రయం చేసి, ప్రస్తుతం అయ్యే ఖర్చు లక్షరూపాయలు పోనూ మళ్లీ లాభాలు విక్రయించాలంటే నిర్వహకులు, ప్రజలపై పెద్ద ఎత్తున ధరలు పెంచి విక్రయిస్తే తప్పా లాభం పొందని దుస్థితి. టపాసులు విక్రయించేందుకు ఆసక్తిగల వాళ్లు లైసెన్స్‌లు దరఖాస్తు చేసుకోవాలని దాదాపు నెల రోజులకు ముందు నోటిఫికేషన్‌ను అధికారయంత్రాంగం విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌తో నగరంలో దాదాపు 200 మంది ఆన్‌లైన్‌లో ఒక్కొక్కరు 5వందలు సర్వీస్తు చార్జీస్ చెల్లించి దరఖాస్తు చేసుకోగా, ఇందులో నిబంధనలు మేరకు జిఎస్టీ చెల్లించడంతో పాటు ఇతర నిబంధనల పాటించినటువంటి వాళ్లు దాదాపు 125 మంది వున్నారు. వీరందరికీ కనీసం దీపావళి పండుగకు వారంరోజులు ముందు అధికారయంత్రాంగం లైసెన్స్‌లు అందించలేదని దుస్థితి. ఈ నిర్లక్ష్యంతో పాటు లైసెన్స్‌దారులు అసోసియేషన్ ముసుగులో అధికారయంత్రాంగం ఒక్కొక్క షాపుకు 40వేల రూపాయలు మామూళ్లు రూపంలో వసూళ్లు చేసిందని, అయితే కనీసం లైసెన్స్‌లు వారం రోజులు ముందు కూడా ఇవ్వలేదని పలువురు షాపుల నిర్వాహకులు లబోదిబోమంటూ నోరు నెత్తికొట్టుకోవడం సమావేశంలో కనిపించింది. పుట్టగొడుగులా పుట్టుకొచ్చిన అసోసియేషన్ ఏమిటని, చాలామందికి తెలియదంటూ సమావేశంలో అధికారులను నిలదీసిన దుస్థితి ఏర్పడింది. అధికార పార్టీలో ఒక ఛోటా నాయకుడు చక్రం తిప్పి ఒక్కొక్కరి నుంచి రూ.40వేలు వసూలు చేశాడని, జిఎస్టీ రూ.25వేలు, పంచాయతీ పన్ను అంటూ రూ.2,500లతో పాటు తాము షాపులు ఏర్పాటు చేసుకోవడానికి కనీసం రూ.25వేల నుంచి రూ.30వేలు ఖర్చుతో వెరసి దాదాపు ఒక్కొక్కషాపుకు రూ.లక్ష ఖర్చు వస్తే, పండుగకు రెండు రోజులు మందు లైసెన్స్‌లు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు తీవ్ర ఆరోపణలు చేయడం కనిపించింది. ఈషాపులు పెట్టుకోవడానికి రూ.లక్షల్లో వడ్డీలకు అప్పులు చేసి టపాసులు కొనుగోలు చేశామని, ఈ స్వల్ప గడువులో తాము ఏమి సంపాదించి ఖర్చులు పోనూ అప్పులు ఎలాతీర్చాలని ఆవేదన వ్యక్తం చేయడం కనిపించింది. ?ఇటీవల సూపర్‌సిక్స్-సూపర్ సక్సెస్ సభ సందర్భంగా విక్రయాలు చేపట్టే ప్రాంతాన్ని ఎంతో శుభ్రం చేశారని, అయితే ఇపుడు టపాసులు విక్రయించేందుకు తాత్కాలిక షెడ్లు (రేకులు), శుభ్రం చేయడానికి అంటూ గత ఏడాది కంటే అదనంగా రూ.10వేలు పెంచేసి మొత్తం రూ.40వేలు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని, అంతేకాకుండా గిఫ్ట్ ప్యాక్‌లంటూ ఒత్తిడులు కూడా అనధికారికంగా ఎక్కువైనట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేయడం కనిపించింది. ఏది ఏమైనప్పటికీ నోటిఫికేషన్ ఫీజు, జిఎస్టీ, రేకుల షెడ్స్, ఫైర్ పీజు పంచాయితీ పన్నుతో పాటు షాపులకు టపాసులు తరలించేందుకు ఒక్కొక్క నిర్వాహకుడికి లక్షరూపాయలకు ఖర్చు చేసుకోవాల్సిన దుస్థితితో పాటు ప్రజలపై ధరలు పెంచి బాదడం తప్పదన్న భావన సర్వత్రా వ్యక్తమౌతోంది

ఆధునిక సమాజంలో అనాగరికం..!

ఉరవకొండ పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీ ముఖ ద్వారం

-కట్టుబాట్లు తప్పి కుమారుడికి వివాహం నిశ్చయించారని ఒక కుటుంబాన్ని 12 సంవత్సరాలు బహిష్కరించిన కులపెద్దలు

-ఈనెల 13న జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పిర్యాదు చేసిన బాధిత ఎంబీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జోగి వెంకటేష్

-ఉరవకొండలో సంచలం రేకెత్తిస్తున్న సంచార జాతులకు చెందిన ఒక జోగి కులం కుటుంబం బహిష్కరణ అంశం

ఉరవకొండ, అక్టోబర్ 18 ప్రభాతవార్త

సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతూ ప్రపంచమే ఒక కుగ్రామంగా మారుతున్న ఈరోజుల్లో ఉరవకొండలో జరిగిన అనాగరిక, అమానుష ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసో ్తంది. విద్యావంతుడైన తన కుమారుడికి మంచి చదువుకున్న అమ్మాయిను చూసి పెళ్లి చేయాలని ఆ తండ్రి నిర్ణయించి నిశ్చితార్థం చేయడమే నేరమైంది. ఉన్న ఊరు, కట్టుబాట్ల మేరకు కాకుండా బయటి ఊరికి వెళ్లి ఎలా వివాహాన్ని నిశ్చంచావంటూ సదరు కుటుంబాన్ని కుల పెద్దలు కులం నుంచి 12 సంవత్సరాలు బహిష్కరించడం సంఛలనం రేకెత్తిస్తోంది. ఉరవకొండ పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో నివాసముంటున్న మాజీ వార్డు సభ్యులు, ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జోగి వెంకటేష్ కుటుంబానికి జరిగిన అన్యాయం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను సైతం ఆశ్రయించడం ఆసక్తికరంగా మారింది. బాధిత జోగి వెంకటేష్ తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే....

ఉరవకొండ పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో నివాసముండే వ్యవసాయం ద్వారా జీవనం సాగిస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జోగి వెంకటేష్ ఎంసీఏ వరకు చదివిన తన కుమారుడికి కర్నాటక రాష్ట్రంలోని స్థిరంగా ఉండే కుటుంబంలో చదువుకున్న అమ్మాయితో వివాహం చేయడానికి నిశ్చయించారు. ఈ విషయం కులంలోని పెద్దలకు నచ్చకపోవడంతో నీవు కట్టుబాట్లు తప్పి మన గుంపులో అమ్మాయిను కాకుండా వేరే గుంపులోని సంబంధాలు కలుపుకోకూడదంటూ కులం నుండి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఖంగుతిన్న

మిగతా 4లో...

స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రతో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

- మొక్కలు నాటిన శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి
- కస్తూరిబా పాఠశాల లో ఉపాధ్యాయులుగా మారిన కలెక్టర్ కలెక్టర్, ఎమ్మెల్యే

మొక్కలు నాటుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి

విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నల్లమాడ అక్టోబర్ 18 ప్రభాతవార్త,

స్వచ్ఛ ఆంధ్రలో శ్రీ సత్య సాయి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం నల్లమాడ మండలంలో పర్యటించిన కలెక్టర్ స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్రలో కార్యక్రమంలో భాగంగా నల్ల మాడలో పలుచోట్ల మొక్కలు నాటారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో కలెక్టర్ తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి లతో కలిసి మొక్కలు నాటి బాసం వారి పల్లి లో మొక్కలు నాటి ఇంటింటికి వెళ్లి మొక్కలను అందజేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో కలెక్టర్ శ్యాం ప్రసాద్ సైకిల్ ముందు భాగంలో విద్యార్థిని కూర్చోబెట్టుకొని ర్యాలీలో సైకిల్ తొక్కారు. అదేవిధంగా చౌటుకుంటపల్లి వద్ద రైతు పద్మనాభరెడ్డి పొలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర సాధనే అందరి లక్ష్యం కావాలన్నారు. సూర్య ఘర్ పథకం కింద ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. పంటలను సేంద్రీయ ఎరువుల వాడకంతో కలుషితం లేని దిగుబడిని, తద్వారా నాణ్యమైన ఆహారాన్ని పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయ ల ప్రాంగణాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల సూర్య ఘర్ సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ప్రతి ఇంటిపై సూర్య సోలార్ ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లుల నుంచి ఉపశమనం పొందవచ్చని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులుగా మారిన కలెక్టర్, ఎమ్మెల్యే; స్థానిక కస్తూరిబా పాఠశాలను జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులుగా మారి 9వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు విద్యా బోధన చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యతోనే మనిషి సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ క్రిష్టప్ప, ఆర్డిఓ సువర్ణ, వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు సమకోటి ఆదినారాయణ, మైల శంకర, బుట్టి నాగభూషణం నాయుడు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు నిబద్ధత, చిత్తశుద్ధితో వృత్తికి వన్నె తేవాలి

- నేటి పరిస్థితులకు అనుగుణంగా వార్తాంశాలను కొత్తగా తెలియజేయాలి : ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్,ఎంఎల్ఎ కాలవ శ్రీనివాసులు, కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులు

జర్నలిస్టులకు సర్టిఫికేట్లు అందజేస్తున్న దృశ్యాలు

రాయదుర్గం, అక్టోబర్ 18,(ప్రభాతవార్త)

జర్నలిస్టులు నిబద్ధత, చిత్తశుద్ధితో వృత్తికి వన్నె తేవాలని, తద్వారా జర్నలిస్టుకు విలువ ఉంటుందని, ప్రతి పౌరుడు పాత్రికేయుడవుతున్న నేటి ఆధునిక యుగంలో సామాజి కాంశాలనుకొత్తగా,సమాజానికి ఉపయోగపడే విధంగా రాయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో సి ఆర్ మీడియాఅకాడమీఆధ్వర్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించిన "గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు" శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభకు కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పాత్రికేయులకు వృత్తి ధర్మంలో విశ్వసనీయత ముఖ్యమని, అది ఒక్కరోజులో వచ్చేది కాదని, నిరంతరం శ్రమించడం వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్క జర్నలిస్టు నైపుణ్యంతో ఎదగాలని, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అందుకు బాగా దోహదపడతాయని అన్నారు. నా రెండో కులం జర్నలిస్టు కులం. ఆ జర్నలిస్టుల కులానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పాత్రికేయులకు అక్రిడిటేషన్ ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య పథకం, విశ్రాంతి జర్నలిస్టులకు పెన్షన్ వంటి వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, సంబంధిత సమాచార శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా అందించడానికి కృషి చేస్తానన్నారు. సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుగా పనిచేసిన కాలవ శ్రీనివాసులు రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత కూడా పాత్రికేయులకు అండగా ఉన్నారన్నారు. సమాచారం శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కూడా తన సహాయ సహకారాలు అందించారన్నారు. నేటికీ మనలో ఒకడిగా గర్వకారణమన్నారు. ఇక గ్రామీణ జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని, అందుకోసం సి ఆర్ మీడియా అకాడమీ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రాయదుర్గంలో నిర్వహించిన రెండు రోజుల పునశ్చరణ తరగతులు కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను విలేకరులు ఆచరణలో పెట్టాలని కోరారు. ప్రతి ఒక్క విలేకరి ఎథికల్ జర్నలిజాన్ని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో గ్రామీణ విలేకరులకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలకు కృషి చేస్తున్న ఏపీ యు డబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ , ప్రధాన కార్యదర్శి అయూబ్ ,ఇతర మిత్ర బృందాన్నీ రాయదుర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించి వారిని ఆత్మీయ సత్కారం చేశారు.అనంతరం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు మాట్లాడుతూ, సమాచార శాఖ మంత్రిగా ఉన్న సమయంలోకాలవశ్రీనివాసులు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణం విషయంలో, అక్కడేషన్లో అంశాల్లో బాగా కృషి చేశారన్నారు. గతంలో పల్లె రఘునాథ రెడ్డి కూడామంత్రిగా పనిచేసి సహకరించారన్నారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల క్రెడిటేషన్ విషయంలో కోత పెట్టిందని, కనుక ఈ ప్రభుత్వంలో అర్హులకు న్యాయం చేయాలని, హెల్త్ స్కీమ్, ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు వంటి సంక్షేమం కార్యక్రమాల్లో అక్రిడిటేషన్ అవసరం ఉందనీ అన్నారు. విశ్రాంతి జర్నలిస్టులకు టెన్షన్స్ స్కీం విషయంలో అండగా ఉండాలని కోరారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు నాయుడుకూడా సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే శిక్షణ కార్యక్రమాల కోసం వీలైనన్ని సెమినార్లు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు జి కొండప్ప ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ఏచూరి శివ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్, తదితర అనంతపురం జిల్లాకు చెందిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు ,జిల్లావ్యాప్తంగా ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అక్కడ పదోన్నతులు స్పీడు... ఇక్కడ డీలా...!

గ్రేడ్ 1 పదోన్నతులు కల్పించాలని డిడి కి అర్జీ ఇస్తున్న వార్డెన్లు (ఫైల్)

- రెండు సంక్షేమ శాఖలకు ఒక్కరే డీడీఅయినా కూడా ముందుకు కదలని పదోన్నతి ఫైల్
- ఆవేదన చెందుతున్న ఎస్సీ హాస్టల్స్ వార్డెన్లు

అనంతపురం న్యూటౌన్,అక్టోబర్ 18 ప్రభాతవార్త

సంక్షేమ శాఖలకు నోడల్ అయినా సాంఘిక సంక్షేమ శాఖలో పదోన్నతలు డీలాపడుతున్నాయి. కానీ బీసీ సంక్షేమ శాఖలో మాత్రం స్పీడుగా జరుగుతున్నాయి. ఆ రెండు శాఖలకు డిడి ఒక్కరే అయినప్పటికీ పదోన్నతల ఫైలు ముందుకు కదలకపోవడం గమనార్హం. అనంతపురం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖలో దాదాపు పది గ్రేడ్ 1 పదోన్నతులు గత కొన్నేళ్లుగా పెండింగ్లో ఉన్నాయి. ఒక వార్డెన్ కోర్టుకు వెళ్లడం వలన ఆ పదోన్నతులకు బ్రేక్ పడింది. అయినా కూడా పదోన్నతులు కోసము పదోన్నతుల పొందే వార్డెన్లు జిల్లా కలెక్టర్, డిడి లతో పాటు ఉన్నతాధికారులకు పదుల సంఖ్యలో అర్జీలు ఇవ్వడం జరిగింది. ప్రస్తుత డిడి గతంలో ఇన్ చార్జ్ డిడి గా ఉన్నప్పుడు పదోన్నతులు కోసము అప్పటి కలెక్టర్ కు ఫైల్ పంపించడం జరిగింది. ప్రభుత్వ లాయర్ అభిప్రాయం కోసం లెటర్ రాయమని చెబుతే.... లెటర్ రాసిన తర్వాత పదోన్నతులు ఇవ్వచ్చు అని సమాధానం ఇవ్వడం జరిగింది. అయినా కూడా కోర్టు కేసు పెండింగ్లో ఉందని ఫైల్ ను పక్కన పెట్టడం జరిగింది. కొన్ని రోజులకు బీఈడీ అర్హత ఉంటే గ్రేడ్1 పదోన్నతులు ఇవ్వచ్చు అని శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కూడా ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. కొన్ని రోజుల తర్వాత

మిగతా 4లో...

ముద్దలాపురం, సంతే కొండాపురంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ ఆంధ్ర కార్యక్రమం

బ్రహ్మ సముద్రం అక్టోబర్ 18 ప్రభాతవార్త

ముద్దలాపురంలో మొక్కలు నాటుతున్న ఈవోపీఆర్డి

వండల పరిధిలోని కన్నెపల్లి పంచాయతి ముద్దలాపురం గ్రామమునందు ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంను శనివారం ఉదయం 10 గంటలకు ముద్దలాపురం గ్రామం నందు ఈ ఓ పి ఆర్ డి రంగనాయకులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీరాముని దేవాలయం దగ్గర పిచ్చిమొక్కలు తొలగించి మొక్కలు నాటడం జరిగింది. సంతే కొండాపురం గ్రామం లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బ్రమ్మసముద్రం మండలంలోని సంతేకొండాపురం గ్రామం లో సర్పంచ్ వనిత మల్లి ఆధ్వర్యంలో స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది పర్యావరణ పరిరక్షణ కాలుష్య నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణంలో మొదటిగా మొక్కలు నాటారు అనంతరం గ్రామ వీధులలో అవగాహన ర్యాలీ ప్రదర్శన ప్రతిజ్ఞ చేయించడం జరిగినది ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు ఓబులేష్ పంచాయతీ కార్యదర్శి అనిత ప్రధానోపాధ్యాయులు నాగరాజు ఎ సల్మా సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఈ ఓ పి అర్ డి రంగనాయకులు నాయకులు మల్లేష్ బాధపల్లి, పంచాయతీ కార్యదర్శి యోగేష్, సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు శివ మూర్తి, దశరథ గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

సంతే కొండాపురంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం

కేటీఎస్ డిగ్రీ కళాశాలలో ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం

రాయదుర్గం రూరల్ అక్టోబర్ 18 ప్రభాతవార్త:

మొక్కలు నాటుతున్న దృశ్యం

రాయదుర్గం స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మనం మన పరిసరాల పరిశుభ్రత అను నినాదంతో ఆర్టీవో ఆఫీస్ నుండి కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ఎస్ శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాలకునెలలో ఒక్కరోజైనా వాహనాలలో రాకుండా నడుచుకుంటూ రావాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కొంతైనా కాలుష్య నివారణ జరుగుతుందని విద్యార్థినీ,విద్యార్థులు ఆ దిశగా అడుగులు ముందుకు వేయాలని పిలుపునిచ్చారు. దానికి మార్గదర్శకంగా ఈరోజు ఆటోలు వదిలి విద్యార్థులు అందరూ కళాశాలకి ర్యాలీగా నడుచుకుంటూ వెళ్లడం జరుగుతుందన్నారు. ర్యాలీ అనంతరం కళాశాల ఆవరణలో డ్వామా అధికారులు మరియు సిబ్బంది, కళాశాల విద్యార్థులు మొక్కలు నాటి స్వచ్ఛమైన గాలి కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏ.పి.డి. రాజారావు, కళాశాల ప్రిన్సిపాల్ గారితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం కళాశాలలో పరిసరాలు పరిశుభ్రం చేసారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సునీల్ కన్నా, ఫరీషా ఫిర్దోస్, బాల నరసింహులు, కిరణ్ జక్కల, బాబు, విజయ్ కుమార్, పాలరాజు, లక్ష్మీనారాయణ, శ్రీరామ్ రెడ్డి, నాగరాజ రెడ్డి, చంద్రశేఖర్, ప్రశాంత్, పాండురంగ, ఎన్సిసి సీటిఓ,ఎన్సిసి క్యాడెట్స్ మరియు ఎన్.ఎస్. ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, డ్వామా ఏపిఓ రవి, ఏపిడి అసిస్టెంట్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రేతలు నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలి-ఎస్సై

కనేకల్లు అక్టోబర్ 18 ప్రభాతవార్త

మాట్లాడుతున్న ఎస్సై నాగమధు

చట్టం సూచించిన నిబంధన మేరకే టపాసుల విక్రయదారులు తప్పనిసరిగా పాటించాలని. దీపావళి పర్వదినాన టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలనీ ఎస్ఐ నాగ మధు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కణేకల్ మండలంలో బాణసంచా విక్రయ లైసెన్స్ కల్గిన దుకాణదారులు మాత్రమే అమ్మాలని మిగితా ఎవరు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళి పురస్కరించుకుని మండలం లో టపాసుల అక్రమ విక్రయాలు జరుగకుండా ఉండేందుకు లైసెన్స్ కల్గిన దుకాణదారులు పాటించాల్సిన నియమ నిబంధనలు ప్రజలు పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు, లైసెన్సు కల్గిన దుకాణాల్లో మాత్రమే బాణసంచా అమ్మాలి. తాత్కాలిక లైసెన్సుదారులు ప్రభుత్వ యంత్రాంగం సూచించిన బహిరంగ ప్రదేశాలలో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డులలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలి. ఆ పరిసరాల్లో ఏమి చేయాలో ఏమి చేయకూడదో తగు సూచనలు చేస్తూ బోర్డులను ప్రదర్శనలో ఉంచాలి. 18 సంవత్సరాలలోపు పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదు. మండలం లోఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ 100 112 లేదా సబంధిత పోలీసు స్టేషన్ కు సమాచారం చేరవేయాలి. బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వలపై సమాచారాన్ని చేరవేసిన వెంటనే తగు చర్యలు తీసుకోవడంతో పాటు సమాచారం చేరవేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నేడు కుందుర్పిలో తలారి రంగయ్య పర్యటన

కుందుర్పి, అక్టోబర్ 18, ప్రభాతవార్త

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు కుందుర్పి మండలం నిజవల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం రచ్చబండ కార్యక్రమానికి కళ్యాణదుర్గం వైకాపా సమన్వయకర్త తలారి రంగయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు శనివారం ఎంపీపీ కమల నాగరాజు,మండల అధ్యక్షుడు హనుమంత రాయుడు, గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని వారు వెల్లడించారు. కావున మండల వ్యాప్తంగా ఉన్న వైకాపా నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎంటిసిలకు నిధుల మంజూరు చేయించలేని ఎంపిపి పెద్దన్న ఎందుకు..?

- ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా పార్టీ మారేది లేదు
- అవిశ్వాస తీర్మాణానికి మొగ్గు చూపుతున్న ఎంపిటిసిలు..?

బెలుగుప్ప, అక్టోబర్ 18 ప్రభాతవార్త

విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్ఆర్సిపి మండల నాయకులు

బెలుగుప్ప మండల ఎంపిపి పెద్దన్న ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించకుండా పదవి చేపట్టి నప్పటి నుంచి ఇప్పటి వరకు నిమ్మకున్నారని, ఎంపిటిసిలను అస్సలు పట్టించుకోవడంలేదని మండల వైఎస్ఆర్సిపికి చెందిన ఎంపిటిసిలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. శనివారం వారు వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి పత్రికా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైఎస్ఆర్సిపి ఎంపిటిసిలు మొత్తం 12 మంది గెలవగా ఎంపిపి పదవికి ఇద్దరిని ఎంపికచేసినట్లు తెలిపారు. అందులోఒకరు రెండున్నర సంవత్సరాలు, మరొకరు మరో రెండున్నర సంవత్సరాల చొప్పున ఉండాలనని తీర్మాణించుకున్నామన్నారు. అయితే మొదటగా పెద్దన్నను ఎంపిపిగా పదవిలో కూర్చో బెడితే పదవిని అనుభవించిన అనంతరం 2024లో అసెంబ్లీ ఎలక్షన్లలో టిడిపి అధికారంలోకి రాగానే వైఎస్ఆర్సిపికి నమ్మక ద్రోహం చేస్తూ ఎంపిపి పెద్దన్న టిడిపిలోకి చేరారన్నారు. అయితే మాట ప్రకారం ఎంపిపి పదవిని రెండున్నర సంవత్సరాల అనంతరం మరొకరికి ఇవ్వాలని కోరుతున్నప్పటికీ ఇప్పటికీ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతూ, అభివృద్ధికి నిధులను ఎంపిటిసిలకు అందివ్వకుండా అభివృద్ధి కుంటు పడేలా చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా మించిపోయింది లేదని వెంటనే ఎంపిటిసి కురువ వరలక్ష్మికి ఎంపిపి పదవి ఇవ్వాలని లేకుంటే అవిశ్వాస తీర్మాణాన్ని ప్రవేశ పెట్టి పదవిని ఏ విధంగా మా వశం చేసుకోవాలో తెలుసునని హెచ్చరించారు. అక్టోబర్ 3వ తేదిన అవిశ్వాస తీర్మాణంకు కలెక్టర్, ఆర్డిఓ ఆఫీసుల్లో తెలియజేశామన్నారు. ఇందుకు ఇచ్చిన గడువు 15 రోజులు ముగిసిందని దానిపై మరోసారి అధికారులను సంప్రదిస్తామని వారు తెలియజేశారు.

ఎన్ని ప్రలోభాలు పెట్టినా టిడిపిలోకి చేరేది లేదు..!

టిడిపి నాయకులు వైఎస్ఆర్సిపి నాయకులతో అనేక ప్రలోభాల గురి చేస్తూ ఇప్పటికే ఇద్దరు ఎంపిటిసిలతోపాటు ఎంపిపి సైతం చేరారని, మేము అలాంటి వారం కాదని మేము ఎలాంటి ప్రలోభాలకు గురి కాబోమన్నారు. వైఎస్ఆర్సిపి గుర్తును ఉపయోగించి, వారి నీడలో ఉంటూ ఎంపిటిసిలుగా గెలిచి టీడీపీలోకి చేరడం ఎంతవరకు సమంజసమో వారికే వదిలేస్తున్నామన్నారు. చేరడమే కాకుండా ఇప్పుడు వైఎస్ఆర్సిపిపై నింధలు, విమర్శలు చేయడం తగదన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

డి.హిరెహాళ్ అక్టోబరు 18 ప్రభాతవార్త

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన కన్వీనర్

అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిన తెలుగుదేశం కార్యకర్త హనుమంతు(44) కుటుంబానికి తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ఆదేశాల మేరకు కన్వీనర్ శనివారం డి.హిరెహాళ్ మండలం హుసగుడం గ్రామం చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి దహన సంస్కారాల కోసం రూ.10000లు ఆర్థిక సహాయం అందించారు. హోసగుడ్డం కు చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు వన్నూరుస్వామి రూ.6వేలు మృతుడు కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల రాజు, చికన్నయ్య, చంద్ర, డీలర్ బసవ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడుకుందాం

- తెలుగుదేశం జిల్లా కార్యదర్శి మల్లికార్జున

బెలుగుప్ప, అక్టోబర్ 18 ప్రభాతవార్త

మొక్కలు నాటుతున్న మండల ప్రభుత్వ అధికారులు

బెలుగుప్ప మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శనివారం మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడుకుందామని తెలుగుదేశం జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల ప్రభుత్వ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దారుకార్యాలయంలో మొక్కలు నాటడం వల్ల వాతావరణం కాలుష్యం కాకుండా నాణ్యమైన గాలిని అందుతుందని ఈ మొక్కల వల్ల వర్షాలు కూడా వస్తాయని తెలిపారు. అందులో భాగంగా ఇంటింటికీ ఒక మొక్కను నాటాలని, వచ్చిన వారందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, స్పెషల్ ఆఫీసర్ విశ్వనాథ్‌రెడ్డి, తహశీల్దారు అనిల్‌కుమార్, మండలపరిషత్ అధికారి లక్ష్మినారాయణ, ఇఆర్‌డిఓ బండిగోపాల్, సర్పంచులు, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక బాణసంచా దుకాణాలు తనిఖీ

గుంతకల్లు, అక్టోబర్ 18 ప్రభాతవార్త

దుకాణాల నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న దృశ్యం

పట్టణంలోని రైల్వే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా దుకాణాలను జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి ఎన్.అశ్వర్థ, వన్ టౌన్ సిఐ మనోహర్‌లు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తాత్కాలిక లైసెన్స్ 3రోజుల విక్రయాలకు మాత్రమేనని, తయారీ, నిల్వ చేయరాదన్నారు. రెండు బకెట్ల ఇసుక, రెండు బకెట్లు నీళ్లు ప్రవేశ ద్వారం వద్ద తప్పనిసరిగా ఉంచాలన్నారు. దుకాణాల మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఖాళీగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రధానంగా పొగ తాగడం, మాచీలు, లైటర్లు వాడరాదని పేర్కొన్నారు. హెచ్చరిక బోర్డులను ఎరుపు అక్షరాలతో ప్రదర్శించాలని సూచించారు. రాత్రి సమయాల్లో దుకాణాలు మూసి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బయటకు వెళ్లడానికి కనీసం రెండు దారులను ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా దుకాణాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

22న మండల సర్వ సభ్య సమావేశం

అగళి, అక్టోబర్ 18 ప్రభాతవార్త : ఈ నెల 22వ తేది బుధవారం 10:30 గంటలకు అగళి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిపి, జడ్పిటిసి, సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకొని తీరుతాం..!

-రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు
-ప్రభుత్వం అనాలోచిత మోండి వైఖరిని విడనాడాలని డిమాండ్

ఉరవకొండ, అక్టోబర్ 18 ప్రభాతవార్త

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.రామప్పనాయక్

చేతులెత్తి ఐకమత్యాన్ని చాటుతున్న జైభీమ్ రావ్ భారత్ పార్టీ, వైఎస్సార్‌సీపీ తదితర పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

రాష్ట్రంలోని వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకొని తీరుతామని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. జైభీమ్ రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఉరవకొండ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం ద్వారా వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.రామప్పనాయక్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరుగగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అశోక్‌కుమార్, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్, ఎస్సీ, ఎస్టీ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు మధుప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జంగం కుమారస్వామి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు వై.పురుషోత్తం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్గ నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలని చేస్తున్న కుట్రను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రులు కూడా ప్రైవేటు యాజమన్యాల చేతుల్లోకి వెళ్తే పేదలకు ఉచిత వైద్యం అందని పరిస్థితులు ఏర్పడుతాయన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునేంతవరకు వివిధ రూపాల్లో ఉద్యమాలు చేపడతామన్నారు. జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆర్.రామప్పనాయక్ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకులు జడ శ్రవణ్‌కుమార్ నాయకత్వంలో ఆయన ఆదేశాల మేరకు భవిష్యత్తు కార్యచరణను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేబీపీ అర్బన్ ఇంచార్జ్ కొడవండ్ల నరేష్, జిల్లా కన్వీనర్ వడ్డేర్ల వీర, నాయకులు సుంకే నాయక్, ప్రసాద్‌నాయక్, ముష్టూరు ఎర్రిస్వామి, ధనుంజయ, పోలేరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం

-భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడిన పెన్నహోబిళ క్షేత్రం

ఉరవకొండ, అక్టోబర్ 18 ప్రభాతవార్త

లక్ష్మినరసింహస్వామి పల్లకీ ఉత్సవం దృశ్యం

ఆలయ ఆవరణంలో మొక్కలు నాటుతున్న ఈవో సి.ఎన్.తిరుమలరెడ్డి

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం ఆశ్వీయుజ ద్వాదశి శనివారం సాయంత్రం లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరి గ్రామోత్సవం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. క్షేత్రం నుండి నీరు పారుతుండ టంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొని నీటి జలపాతాల అందాలను తిలకిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిక ఆలయ ఈవో : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి కార్యాలయ సిబ్బందితో కలిసి వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులు, పర్యాటకులు క్షేత్రంలో అవకాశం ఉన్న చోట మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.

బాణసంచా దుకాణాలపై అధికారుల దాడులు

- 14 దుకాణాలకు రూ.64 వేలు జరిమానాలు

గుంతకల్లు, అక్టోబర్ 18 ప్రభాతవార్త

జరిమానాలు విధిస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకర్

పట్టణంలోని రైల్వే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా విక్రయ దుకాణాల సముదాయంపై లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. నిబంధనలను విస్మరించి ఇష్టానుసారంగా టపాసులు విక్రయిస్తున్న 14 దుకాణాలకు 64 వేలు జరిమానాలు విధించారు. టపాసుల బాక్సులపై తయారు దారుని చిరునామా, తయారు తేదీ, ధర, కస్ట్యుమర్ కేర్ నెంబర్ లేనందున జరిమానాల విధించినట్లు లీగల్ మెట్రాలజీ గుంతకల్లు డివిజన్ ఇన్‌స్పెక్టర్ వైజి శంకర్ ప్రభాతవార్తకు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ టపాసులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కళ్యాణదుర్గంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం

కళ్యాణదుర్గం టౌన్, అక్టోబర్ 18, ప్రభాతవార్త

సైకిల్ ర్యాలీ చేపడుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం పట్టణంలోని ఎస్ వి జిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హర్షలత ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకత బృందం, విద్యార్థులు సైకిల్ ర్యాలీ చేపడుతూ వాయు కాలుష్యం పై ప్రజలకు అవగాహన కల్పించారు. సోలార్ ఎనర్జీ వల్ల ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు సూర్య నాగిరెడ్డి,ఎన్ఎస్ఎస్ పివోలు శ్రీధర్, రవిశంకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదు

గుంతకల్లు, అక్టోబర్ 18 ప్రభాతవార్త

సామూహిక దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

పట్టణ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదని కురువ సంఘం నాయకులు సోమశేఖర్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్‌లు అన్నారు. సమస్యల పరిష్కారానికై మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఐ నిర్వహిస్తున్న సామూహిక దీక్షలకు శనివారం వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కసాపురం బ్రిడ్జి, బళ్లారి గేటు, ధర్మవరం గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అలాగే గుంతలు పడ్డ ప్రధాన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. 5వరోజు దీక్షలో మిల్లు హమాలి నాయకులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందు, ఏఐటియుసి నాయకులు మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులుయాదవ్, నాయకులు ఈశ్వరయ్య, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో శుభ్రం చేసిన పోలీసులు

డి.హిరెహాళ్ అక్టోబరు 18 ప్రభాతవార్త

పోలీస్ స్టేషన్ ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్.ఐ. గురుప్రసాద్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో చీపురుపట్టి శుభ్రం చేశారు. శనివారం డి.హిరెహాళ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర లో భాగంగా ఎస్సై తన సిబ్బందితో కలిసి శుభ్రత పరిశుభ్రతను పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన వాతావరణంలో జీవనం సాగిస్తే ఆరోగ్యంగా మానవమనగడ సాగుతుందని ఎస్సై చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రతను విధిగా పాటించి ఆరోగ్యంగా జీవిస్తూ తమ జీవన పరిమాణాన్ని పెంపొందించుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవనం సాగించాలని ఆయన కోరారు. అందరం ఐకమత్యంతో శుభ్రత పరిశుభ్రతను పాటిస్తే ఆంధ్రప్రదేశ్ ను ఆరోగ్యవంతమైన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రగా మార్చుకోవడానికి అవకాశం ఉంటుందని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించి నడుచుకోవాలని ఎస్సై తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళ ముందు ఇంటి చుట్టుపక్కల మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించేందుకు నడుం బిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన ర్యాలీ. మానవహారం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తెదేపా నాయకులు.

విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈ ఓ ఆర్ డి గోవిందప్ప.

రొద్దం. అక్టోబర్ 18 ప్రభాతవార్త.

మండల కేంద్రం హై స్కూల్ ఆవరణంలో శనివారం రెవెన్యూ సిబ్బంది వెలుగు సిబ్బంది కూటమి నాయకులు స్కూల్ సిబ్బంది కలిసి మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణంలో వారి స్థలాల్లో విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని తాసిల్దార్ పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా స్వచ్ఛందరస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే సైకిల్ ర్యాలీ చేపట్టి అనంతరం మానవహారం ఏర్పాటు చేసి అందరి చేత గోవిందప్ప ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు కూటమి నాయకులు ప్రధానోప

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

-కమిషనర్ బాలస్వామి

మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ బాలస్వామి తదితరులు

అనంతపురం అక్టోబరు18 ప్రభాతవార్త

నగరంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి మంచి గాలిని ఆస్వాదించి ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను నిర్మించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బి.బాలస్వామి పిలుపునిచ్చాడు. స్వర్ణ ఆం ధ్ర-స్వచ ఛ్ఆంధ్ర కార్యాక్రమంలో భాగంగా స్థానిక అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయం వద్ద స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర థీమ్ -స వ్వచ్ఛమైన గాలి (క్లీన్ ఎయిర్) ప్రతి నెలా 3వ శనివారం నిర్వహించే సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాడు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు మొక్కలు నాటుకుని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా వుందన్నాడు. ఈ మొక్కలు పెరిగి చెట్లుగా మారడంవల్ల మంచి గాలిని అందించడం వల్ల ఆహ్లాదకరమైన జీవితం గడుపవచ్చన్నాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా 3వ శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటివద్ద మొక్కలు నాటి వాటిని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు షాకీర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ అనేది విశ్వవ్యాప్తం

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్!

రాప్తాడు, అక్టోబర్ 18 ప్రభాతవార్త

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

సైన్సు, శాస్త్రీయ పరిజ్ఞానం అనేవి ఒక తరగతి గదికి లేదా ఒక హైస్కూల్ కు పరిమితం కాదని అవి విశ్వవ్యాప్తమైనవని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్ తెలియ జేశారు. జెవివి రాప్తాడు మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు తుమ్మల రాజేశ్వరి అధ్యక్షతన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్ ప్రాతిపదికన శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ప్రజల్లో పెంపొందించాలనే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక ఏర్పడి పనిచేస్తుందని అన్నారు. శనివారం జరిగిన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు రాప్తాడు మండలంలో 2 ప్రైవేటు హైస్కూల్స్,5 జడ్పీ హైస్కూల్స్‌తో పాటు మోడల్ హైస్కూల్,కస్తూరిబా రెసిడెన్షియల్ హైస్కూల్లో జరిగాయని, మొత్తం 1050 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు తెలియజేశారు.అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 20వేల మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. అనంతరం చెకుముకి ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్,రాప్తాడు మండల జన విజ్ఞాన వేదిక నాయకులు ఎం.శాంతరాజు ఉపాధ్యాయులు లక్ష్మన్న, రోజారమణి, సరస్వతి,గ్రేస్, అంజనాదేవి తదితరులు పాల్గొన్నారు.

సాయి విజ్ఞాన్‌లో కాలుష్య రహిత దీపావళి సంబరాలు

దీపావళి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త

స్థానిక మూడవ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో సోమవారం సెలవు కారణంగా ముందుగానే ఈ రోజు దీపావళి సంబరాలు జరిగాయి. ఇందులో పాఠశాల డైరెక్టర్లు ఎమ్.పి. శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లావణ్యరామ్ పాల్గొనడం జరిగింది. చతుర్దశి రోజు నరకాసురుడ్ని చంపడం అమావాస్య రోజు పండుగ జరుపుకుంటారు అని తెలిపారు. దీపావళి పండగ నూతన వెలుగు తీసుకొచ్చే గొప్ప పండగ. దిపావళి అంటే దీపాల వరుస అని అర్థం. ఇందులో భాగంగా పిల్లలు సత్యభామ కృష్ణుడిగా, సీత రాముల్లగా అలంకరించుకొని అలరించారు తర్వాత పూజ చేసి తీర్థప్రసాదాలతో ఈ కార్యక్రమాన్ని ముగించారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు తమ పిల్లలకి మంచి చదువుతోపాటు మన సంస్కృతి సంప్రదాయమైన పండుగల ప్రత్యేకతను తెలిపినందుకు పాఠశాల యామాన్యానికి ధన్యవాదాలు తెలియజేసారు.

క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణ

క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్‌మీట్‌లో విద్యార్థులు

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త

భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ మైభారత్ అనంతపురం ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాల నందు క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలుర కళాశాల ప్రిన్సిపాల్ పి.రాయప రెడ్డి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్, బి.నంద కుమార్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్, కే.జయమారుతి, ఐఎంసి మెంబర్స్ శేషాంజనేయులు, సుధీర్, సీనియర్ అధ్యాపకులు బి.జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు క్రీడలలో రాణించాలి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడలలో గెలుపొందిన యువతకు కేంద్ర ప్రభుత్వం చే జారీచేసిన ప్రశంసా పత్రాలు, మెడల్స్ ,మరియు ట్రోఫీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు పి. గోపి, అధ్యాపకులు మరియు యువతీ యువకులు పాల్గొన్నారు.

ఇద్దరు టిడిపి నాయకులు మృతి

ఆత్మకూరు అక్టోబర్ 18 ప్రభాతవార్త

ఆత్మకూరు మండల పరిధిలోని వై.కొత్తపల్లి,పంపనూరు గ్రామాలుకు చెందిన ఇద్దరు తెదేపా నాయకులు ఆకస్మికంగా మృతి చెందారు.వై.కొత్తపల్లికి చెందిన గుజ్జల వెంకటేసు,పంపనూరుకు చెందిన రామచంద్ర శనివారం మృతి చెందారు.రామచంద్ర అనారోగ్యంతో,వెంకటేసు గుండెపోటుతో మరణించనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.టిడిపి నాయకులు మరణం తెలుసుకున్న మండల తెదేపా నాయకులు కృష్ణమెహన్‌చౌదరి,శశాంక్‌చౌదరి తదితర నాయకులు వారికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ఓదార్చారు.

డబుల్ సెంచురీతో విజృంబించిన ఎస్‌వి రాహుల్

- 94 పరుగులతో తోడుగా నిలిచిన ప్రసాద్
- డ్రా దిశగా ఆంధ్ర-ఢిల్లీ క్రికెట్ టోర్నీ

డబుల్ సెంచురీ చేసిన ఎస్‌వి రాహుల్

అనంతపురం సిటీ, అక్టోబర్ 18 ప్రభాతవార్త

ఆర్డిటి క్రీడా మైదానం వేదికగా ఆంధ్ర-ఢిల్లీ మధ్య జరుగుతున్న క్రికెట్ టోర్నీలో ఆంధ్ర బ్యాట్స్‌మెన్ ఎస్‌వి రాహుల్ డబుల్ సెంచురీతో చెలరేగారు. ఎస్‌వి రాహుల్‌కు తోడుగా ఎస్‌డిఎంఈ ప్రసాద్ 94 పలుగులు సాధించి ఆంధ్ర జట్టును భారీ స్కోర్ సాధించేందుకు తోడుగా నిలిచారు. ఆర్డిటి క్రీడా మ ఐదానంలో జరుగుతున్న ఎసిఎ ఆధ్వర్యంలో ఆర్డిటి మైదనం వేదికగా జరుగుతున్న సికె నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లో శనివారం 3వ రోజు ఆంధ్ర జట్టు 630/6 పరుగులు సాధించగా, ఢిల్లీ జట్టు 200/5 కొనసాగుతోంది. 3వ రోజు ఎస్‌వి.రాహుల్ 386 బంతుల్లో 18 ఫోర్లు, 2 సిక్సర్లతో 203 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచారు. ఎస్‌వి రాహుల్‌కు తోడుగా ఎస్‌డిఎన్‌వి ప్రసాద్ 91 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సులతో 94 పరుగులు సాధించారు. ఢిల్లీ బౌలర్లు దేవులక్క, భరద్వాజ్, యుగల్ సైనిలు రెండేసి చొప్పున వికెట్లను తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 200 పరుగులను సాధించారు. ఢిల్లీ జట్టు 430 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది. ఆదివారం మ్యాచ్ చివరి రోజు కావడంతో డ్రా దిశగా ఫలితం తేలే అవకాశం కనిపిస్తోంది. 3వ రోజు మ్యాచ్‌లను ఏసిఎ సెక్రెటరీ నాగగంగాధర్, ఏడిసిఏ కార్యదర్శి భీమ లింగారెడ్డి, జాయింట్ సెక్రెటరీ మురళీకృష్ణ, కోశాధికారి షబ్బీర్ అహ్మద్ తదితరులు పర్యవేక్షించారు.

నూతన మండల సమాక్య సభ్యులు ఎంపిక

సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి

శింగనమల, అక్టోబర్ 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని విజయలక్ష్మి మండల సమాఖ్యలో శనివారం 23వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఇఓ నరసింహరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు 2024-25లో జరిగిన మండల సమాఖ్య అభివృద్ధిని గురించి వివరించారు. రెండు సంవత్సరాలు పూర్తి అయిన మండల సమాఖ్య పాలన సభ్యులను నూతనంగా ఎన్నుకున్నారు. శింగనమల అధ్యక్షురాలు శాంతి, బండమీదపల్లి కార్యదర్శి భారతి, ఆదిలక్ష్మి, పెద్దక్క, మణి ఈ సమావేశంలో గ్రామ సంఘాల నాయకురాళ్లు, ఏపిఎం ఈశ్వరయ్య, సిసిలు రంగప్ప, వెంకటేష్, నరసింహమూర్తి, సరస్వతి, కులశేఖర్‌రెడ్డి, అకౌంటెంట్ నూర్‌జాన్ పాల్గొన్నారు.

ఆకులేడులో స్వర్ణాంధ్ర-స్వచాంధ్ర

మొక్కలు నాటుతున్న అధికారులు

శింగనమల, అక్టోబర్ 18 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఆకులేడు గ్రామ పంచాయితీలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధిహామీ పథకం ఏపిడి ఆయేషా, గ్రామ సర్పంచు సుభాషినిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముస్లిం స్మశాన వాటికలో 350 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఆకులేడు రామాంజినేయులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రహంతుల్లా, పంచాయితీ కార్యదర్శి నరసింహారెడ్డి, విఆర్ఓ నిరంజన్‌రెడ్డి, ఏపిఓ భాగ్యలక్ష్మి, ఇసి దామోదర్, టెక్నికల్ అసిస్టెంట్ హరినాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ షేక్షావలి, ఇతర సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉపాది కూలీలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

మొక్కలును నాటుతున్న అధికారులు,ప్రజా ప్రతినిధులు

ఆత్మకూరు అక్టోబర్ 18 ప్రభాతవార్త

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఎంపిడిఓ లక్ష్మినరసింహ,తహశీల్దార్ లక్ష్మినాయక్ ఆధ్వర్యంలో స్వచ్ఛమైన గాలి అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిశుభ్రతను పాటిస్తూ కాలుష్య నివారణ కొరకు మొక్కలు నాటారు.వాయు కాలుష్యాన్ని తగ్గించి ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని చెట్లును పెంచాలని,కార్లు,బైకులకు ప్రత్యామ్నాయంగా సైక్లింగ్,నడక ప్రోత్సహించాలని,సౌర విద్యుత్ వినియోగించాలని తెలియజేశారు.నెల రోజుల్లో ఒకరోజు ద్విచక్ర వాహనాలు కాని కార్లు వాడకుండా ఉండాలన్నారు.అపరిశుభ్రంగా ఉన్న ఆర్టీసీ ప్రాంగణంలో శ్రమదానంతోను,యంత్రాల సహాయంతో శుభ్రం చేశామని ఎంపిడిఓ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఈ శివకుమార్,ఎంఈఓ నరసింహారెడ్డి,ఏపిఓ వెంకటనారాయణ,పంచాయితీ కార్యదర్శి సాధిక్ వలి,తెదేపా నాయకులు హిందూపురం అధికార ప్రతినిధి శశాంక్‌చౌదరి, కందుల ఓబుళపతి,అక్కులప్ప,రామదాసు,అద్దెప్ప, అశోక్,లక్ష్మిదేవి,మండల అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు నిర్వహించిన ఎస్సై రాంబాబు

అనంతపురం రూరల్, అక్టోబర్ 18 ప్రభాతవార్త

వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

అనంత రూరల్ మండలం రాచనపల్లి పంచాయతీ సిండికేట్ నగర్ సమీపంలో రూరల్ మండలం ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో శనివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించి, లైసెన్స్ లు, వాహన రికార్డులను పరిశీలించి లై సెన్స్ లు,రికార్డు లేని వాహనదారులకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ ఫోర్ వీలర్ నడిపే ప్రతి ఒక్క వాహనదారుడు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించడంతో పాటు లైసెన్సులు కలిగి వాహనాలు నడపాలని, అదేవిధంగా టు వీలర్ నడిపే వాహనదారులు కూడా లైసెన్సు కలిగి ఉండడంతోపాటు తప్పకుండా హెల్మెంట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

26న మదనపల్లిలో శ్రీశ్రీ కళావేదిక 158 వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం

- రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరి వెల్లడి

అనంతపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త బ్యూరో

గుత్తా హరి సర్వోత్తమ నాయుడు

నిరంతర సాహితీ క్రతువులో భాగంగా అక్టోబర్ 26వ తేది మదనపల్లిలో జాతీయ శతాధిక కవిసమ్మేళనం నిర్వహించ నున్నట్లు శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు వెల్లడించారు. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో "అన్నమయ్య సాహితీ ఉత్సవం" పేరిట ఘనంగా సాగుతుందని వివరించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణంలో శ్రీరామ కమ్యూనిటి హాల్లో అత్యంత వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 158వ శ్రీశ్రీ కళావేదిక ఫెస్ట్‌గా అన్నమయ్య కమిటీ ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం నేతృత్వంలో వైభవంగా జరుగనుందన్నారు. కవితాగానం, సాహితీ సదస్సు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు వుంటాయన్నారు. తెలుగు భాష, సాహిత్యం, కళలు, తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా శ్రీశ్రీ కళావేదిక నిరంతర సాహితీ కార్యక్రమాల్లో భాగంగా ప్రతీనెలా ఒక్కో జిల్లాలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఏ విధమైన ఫీజు లేకుండా పాల్గొన్న కవులు, కళాకారులు అందరిని జ్ఞాపిక, శాలువా, పూలదండ, ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించనున్నమన్నారు. పాల్గొన్న వారందరికీ ఉచిత భోజన వసతి సౌకర్యం కలిపించనున్నట్లు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు తెలిపారు.

రాచానపల్లి లో స్వచ్ఛఆంధ్ర,స్వచ్ఛదివాస్

- పంచాయతీని స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దాలి
- డి యల్ పీ ఓ విజయ్ కుమార్.

గ్రామంలో పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త

మండలంలోనే అత్యంత పరిశుభ్ర గ్రామంగారాచానపల్లి పంచాయతీని తీర్చి దిద్దాలనే లక్ష్యంలో భాగంగా నెలలో ఒక రోజు స్వచ్ఛత కోసం అంకితం కావాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు మేరకు అనంతపురం రూరల్ మండలం రాచనపల్లి గ్రామ పంచాయతీ లో స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్ లో డి యల్ పీ ఓ విజయ్ కుమార్,పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించి పంచాయతీలో పాఠశాలవిద్యార్థులు,కార్మికులతో కలసి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి అనంతరం కార్మికులతో చెత్త మొత్తం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ జిల్లాలోని అత్యంత పరిశుభ్రత మండలం గా తీర్చదిద్దాలని సంకల్పంలో భాగంగానే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ది వాస్ కార్యక్రమాన్ని రాప్తాడు నియోజక వర్గ ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు రాచానపల్లి పంచాయతీ లో మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించి, సిండికేట్ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కు అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రజల నుంచి తడి పొడి చెత్త సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్రగాయాలు

బుక్కరాయసముద్రం అక్టోబర్ 18 ప్రభాతవార్త

గాయపడిన భరత్‌కుమార్‌రెడ్డి

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని రోటరీపురం గ్రామ సమీపంలో ఉన్న ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సి.ఎస్.సి చదువుచున్న విద్యార్థి భరత్‌కుమార్‌రెడ్డి కి శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర రక్తగాయాలైనవి.స్థానికులు పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సి.ఎస్.సి ఫైనల్ ఇయర్ చదువుచున్న భరత్‌కుమార్‌రెడ్డి తండ్రి కిరణ్‌రెడ్డి అనంతపురం పట్టణంలోని బళ్లారి బైపాస్ సమీపంలో నివసిస్తున్నారు.శనివారం ఉదయం కాలేజికి ద్విచక్రవాహనం ఎపి02 బిఇ 5245 స్కూటీ పై వచ్చాడు.సాయింత్రం కళాశాల ముగించుకొని తిరిగి ఇంటికి బయలుదేరిన విద్యార్థి భరత్‌కుమార్‌రెడ్డి బుక్కరాయసముద్రం ముసలమ్మకట్ట సమీపంలో ఉన్న చెరువుకట్ట పై అనంతపురం వెళ్ళుతున్న విద్యార్థి టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేయబోయే సమయంలో ఎదురుగ వస్తున్న కారు ఎపి02 సిచ్ 9699 అనే కారును డీ కొనడంతో తలకు తీవ్రగాయాలైనవి,స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ పుల్లయ్య సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థిని వైద్యనిమిత్తం అనంతపురం జనరల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

ఘనంగా వాల్మీకీ మహర్షి జయంతి వేడుకలు

వాల్మీకీ విగ్రహాన్నికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వాల్మీకీ సోదరులు

ఆత్మకూరు అక్టోబర్ 18 ప్రభాతవార్త

రామాయణాన్ని రచించిన వాల్మీకీ మహర్షి జయంతి వేడుకలను శనివారం ఆత్మకూరు వాల్మీకీ సోదరులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వాల్మీకీ సోదరులు మండల కేంద్రంలోని వాల్మీకీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలో వాల్మీకీ ఆడపడుచులు జ్యోతులతో గ్రామంలో ఊరేగింపు తీసుకెళ్లి వాల్మీకీ విగ్రహం వద్ద పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల వాల్మీకీ సోదరులు పాల్గొన్నారు.

ఏడిసిసి లో కారుణ్య నియామకం

అనంతపురం వైద్యం అక్టోబర్ 18 ప్రభాతవార్త

ఏడిసిసి బ్యాంక్ లో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన రమేష్ నాయక్ కుటుంబ సభ్యుడికి ఏ డి సి సి బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్ గా కారుణ్య నియామించారు. శనివారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి చేతుల మీదుగా అభ్యర్థికి నియామక పత్రం అందజేశారు ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి రావాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన అదజేశామని అది వారి కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సురేఖ రాణి డిజిఎంలు రాంప్రసాద్ సుఖ దేవి బాబు విజయ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు

క్లస్టర్ సమావేశానికి హాజరైయిన ఉపాధ్యాయులు

బుక్కరాయసముద్రం అక్టోబర్ 18 ప్రభాతవార్త

పదవ తరగతి లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు పిలుపునిచ్చారు.శనివారం బుక్కరాయసముద్రం మండల పరిదిలోని వెంకటాపురం లో ఏర్పాటు చేసిన క్లస్టర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లడుతూ సకాలంలో సిలబస్ పూర్తిచేసి వెనుక బడిన విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచాడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లింగానాయక్,డిఈఓ ఆఫీసు ఏ ఎస్ఓ శ్రీనివాసులు,ఏపీవో మంజునాథ్,ఇన్‌చార్జి ప్రదానోపాధ్యాయులు రామాంజి నేయులు, క్లస్టర్ పాఠశాలల ఉపాధ్యాయులు ఎస్ సిరాజ్‌ద్దీన్, చితంబరరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కురుకుంటను పరిశుభ్రముగా ఉంచడమే మా లక్ష్యం

- మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం.
- గ్రేడ్2 పంచాయతీ కార్యదర్శి సర్దార్ వలి.

అనంతపురం రూరల్, అక్టోబర్ 18ప్రభాత వార్త

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్న దృశ్యం

దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చి దిద్దాలనే లక్ష్యంలో భాగంగా నెలలో ఒక రోజు స్వచ్ఛత కోసం అంకితం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు అదే విదంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు మేరకు అనంతపురం రూరల్ మండలంలో కురుకుంట గ్రామ పంచాయతీ లో స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛదివాస్ "కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం కురుకుంట పంచాయతీ లో గ్రేడ్ 2 కార్యదర్శి సర్దార్ వలి స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛదివస్, కార్యక్రమం నిర్వహించి పంచాయతీ కార్మికులతో గ్రామంలోని చెత్త మొత్తం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలోని అత్యంత పరిశుభ్రత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగడం జరుగు తుందని, అందులో భాగంగానే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ది వాస్ కార్యక్రమాన్ని రాప్తాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు కురుకుంట గ్రామ పంచాయతీలలో మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించి గ్రామంలోని చెత్త మొత్తం శుభ్రం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం జరుగుతుందన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద చర్చించే కేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ధర్మేంద్ర, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సాయి గణేష్ ఆగ్రో ఏజెన్సీ దుకాణాన్ని తనిఖీ చేసిన ఏవో.

అనంతపురం రూరల్, అక్టోబర్ 18 ప్రభాతవార్త



శ్రీ సాయి గణేష్ ఆగ్రో ఏజెన్సీ లో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో

జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఉమా మహేశ్వరమ్మ ఆదేశాల మేరకు బస్టాండ్ సమీపము లో గల శ్రీ సాయి గణేష్ ఆగ్రో ఏజెన్సీస్ దుకాణమును తనిఖీ చేయాలనీ జిల్లా

టపాసుల అక్రమ నిల్వలు మరియు అమ్మకాలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల విస్తృత తనిఖీలు

టపాకుల అక్రమ నిర్మలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు

అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 18 ప్రభాతవార్త

అనంతపురము ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అండ్ ఎంఫోర్సుమెంట్ అధికారి వైబిపిటిఏ . ప్రసాద్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులతో కమర్షియల్ టాక్స్ అధికారులు మరియు లీగల్ మెట్రోలజి అధికారులతో కలసి అనంతపురము నగరంలో టపాసుల దుకాణాల లో తనిఖీలు నిర్వహించడమైనది. సోములదొడ్డి గ్రామం దగ్గర, ఇస్కాన్ గుడి ఎదురుగా ఫెడ్కాన్ ఫైర్ వర్క్స్, ఇంద్రప్రస్తా ఫైర్వర్క్స్ మీలో ఉన్నకాకర్స్‌ను ముమ్మరం గా తనిఖీలుచేశారు. ఈతనిఖీలలో భాగముగా తయారీదారుల పేరు, చిరునామా మరియు కన్స్యూమర్ కేర్ ఫిర్యాదు వివరాలు మొదలగు ముద్రించకపోవడం , భౌతిక నిల్వలకు రికార్డులు సరిగా నిర్వహిం చకపోవడం, భౌతిక నిల్వలకు మరియు బిల్లులకు వ్యత్యాసాలను గుర్తించడం అనగా అక్రమ నిల్వలను గుర్తించడం వంటి చాలా లోపాలను గమనించడం జరిగినది. నిబంధనలకు విరుద్ధముగా వ్యాపారము చేస్తున్నందు వలన లీగల్ మెట్రోలజి యాక్ట్, 2009 మరియు ఎల్ ఎం పిసి రూల్స్, 2011 చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి సుమారు రెండు కోట్ల భౌతిక నిల్వలకు సంబందించి బిల్లులను సబ్మిట్ చేయవలసినదిగా జిల్లా వాణిజ్య పన్నుల శాఖ అధికారి ద్వారా సంబంధిత డీలర్స్ కు నోటిసులు జారి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేయటం మరియు అక్రమ నిల్వ ఉంచి పట్టుబడితే ఉపేక్షించేది లేదని, టపాసులు అక్రమ నిల్వల పై ప్రత్యేక నిఘా ఉంచినట్లు మరియు చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడును అని ప్రాంతీయ నిఘా అధికారి వై బి పి టి ఏ. ప్రసాద్ హెచ్చరించారు. తనిఖీలలో విజిలెన్సు సీఐ లు . కే. శ్రీనివాసులు , ఎస్. జమాల్ బాష , ఏవో జే. వాసు ప్రకాష్; డిసిటిఓ. బి.సురేష్ కుమార్ సిబ్బంది మరియు వారితో పాటు కమర్షియల్ టాక్స్ అధికారి మాలే శ్రీనివాసులు; లీగల్ మెట్రోలజి ఇన్స్పెక్టర్ కే.ఎస్. ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

అదును దాటిపోతున్నా పప్పుశెనగ పంపిణీ చేయరా..?!

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు
- యూరియా కావాలంటే అనవసర ఎరువులు అంటగడుతున్నారని ఆగ్రహం
- ఫోన్లు చేసి అతికష్టం మీద కోరంకు తగ్గ ఎంపీటీసీలను రప్పించి సమావేశం

ఉరవకొండ, అక్టోబర్ 18 ప్రభాతవార్త

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతున్న మండల వ్యవసాయాధికారి రామకృష్ణుడు

రబీ పంట కాలం ప్రారంభమై పంటలు పెట్టుకునే అదును దాటిపోతున్నా రైతులకు ప్రభుత్వం రాయితీ పప్పుశెనగ, ఇతరత్రా పంటల విత్తనాలు పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకు చెందిన ఆమిద్యాల ఎంపీటీసీ దబ్బర వెంకటేష్ వాపోగా నెరమెట్ల సర్పంచ్ బి.యోగేంద్రరెడ్డి ఆయనతో స్వరం పలికారు. నల్లరేగడి భూములు కల్గిన రైతులు విత్తనం వేయడానికి భూములను సిద్ధం చేసుకొని విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారని వారు వాపోయారు. పట్టణంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఎం.నరసింహులు అధ్యక్షతన, ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరుగగా సమస్యలు ఏకరవు పెట్టాయి. ప్రభుత్వం యూరియా కొరత లేదని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో యూరియా అందుబాటులో లేదని యూరియా కావాలంటే ఫర్టిలైజర్స్ దుకాణదారులు అంటగట్టె అనవసర కాంప్లెక్స్ ఎరువులు, పురుగుల మందులను వేలాది రూపాయలు ధారపోసి కొనగోలు చేయాల్సి దుస్థితి ఏర్పడిందని వాపోయారు. దీంతో స్పందించిన ఏవో రామకృష్ణుడు మాట్లాడుతూ ప్రభుత్వం పప్పుశెనగను 25శాతం రాయితీతో పంపిణీ చేయాలని నిర్ణయించి ధరలు కూడా నిర్ణయించిందని అతి త్వరలో పంపిణీ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. పట్టణానికి చెందిన ఎంపీటీసీ వన్నూరుసాబ్ మాట్లాడుతూ పట్టణం లోని ప్రధాన రహదారికి పక్కనగల పెద్ద మురుగునీటి కాలువల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లు తున్నా వాటిని శుభ్రం చేయడానికి అధికారులు మోగ్గు చూపడంలేదన్నారు. సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూమిలో పిల్లల పార్కు ఏర్పాటు చేయాలని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో జూపార్కు ఏర్పాటు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ అధికారులను కోరారు. ఈసమావేశంలో డిప్యూటీఎంపీడీవో సతీష్‌బాబు, ఏవో శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. కాగా సమావేశం ప్రారంభం మరొక మారు కోరం సమస్య ఏర్పడగా ఎంపీపీ పలువురు ఎంపీటీసీలకు ఫోన్‌చేసి రప్పించి అతికష్టం మీద సమావేశం నిర్వహించాల్సి వచ్చింది. అయితే అనేక కీలక శాఖల అధికారులు డుమ్మా కొట్టగా కేవలం నాలుగైదు శాఖలకు చెందిన అధికారులే హాజరు కావడం విశేషంగా చెప్పాలి.

గుప్త నిధులు దొంగిలించిన గణపతి విగ్రహం కోసం పోలీసులు తీవ్ర గాలింపు

- సిసి కెమెరాల ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్న ఎస్ఐ వీరేష్
- కర్ణాటక రాష్ట్రం కల్లం బెల్ల చెరువు వద్ద విగ్రహాన్ని ధ్వంసం చేశారన్న ఆరోపణలు..?
- విగ్రహాన్ని ఎత్తుకెళ్లడానికి 3 నెలల నుంచి రెక్కి..!- స్కానర్ ద్వారా స్కాన్ చేశారని చర్చలు

అగళి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అగళి పురాతన శంకరేశ్వర స్వామి దేవాలయం సమీపంలో పురాతన గణపతి దేవాలయం ఉంది. సదరు గణపతి దేవాలయంలో చోళుల కాలంలో శంకరేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించడంతోపాటు గణపతి విగ్రహాన్ని సైతం చోళుల కాలంలోనే ప్రతిష్టించారు. అది చాలా పెద్ద రాతి గణపతి. చాలా అందంగా శిల్పులు చెక్కారు. ముద్దుముద్దుగా ఉన్న బొజ్జగణపయ్య 400 కెజిలు ఉన్నా లెక్క చేయకుండా గుప్త నిధుల తవ్వకం దారులు 10 మందిపైన కలిసి ఎంతో చాక చక్యంగా దొంగలు ఎత్తుకెళ్లిన విషయం పాటకులకు విధితమే. సదరు విగ్రహాన్ని ఎత్తుకెళ్లడానికి ప్రణాళికలు రచించి అక్కడే రెక్కి నిర్వహించినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అగళి చెరువులో చేపలు పట్టుకునేందుకు వచ్చారన్న విధంగా దేవాలయం చుట్టు పక్కల తిరిగారని, నిశితంగా భక్తుల సంచారం ఎప్పుడు ఉంటుంది, సిసి కెమెరాలు పని చేస్తాయా లేదా అన్న విషయంతోపాటు స్కార్ తెచ్చి ఆ విగ్రహాన్ని పరిశీలించి అందులో వజ్రాలు ఉన్నాయని నిర్ధారణకు వచ్చాకే గుప్త నిధుల తవ్వకం దారులు చాకచక్యంగా టాటా ఏసీలో ఆ బరువైన 400 కెజిల విగ్రహాన్ని దొంగిలించుకుపోయారు. ఆ దేవాలయం వద్ద అమర్చిన సిసి కెమెరాలు పని చేయవు. ఆ విషయాన్ని సైతం నిశితంగా గుప్త నిధుల తవ్వకం దారులు గమనించారు. పకడ్బందీగా రెక్కి నిర్వహించిన అనంతరం పోలీసులు, సిబ్బంది తక్కువగా ఏ సమయంలో ఉంటారన్న విషయాన్ని కూడా గమనించారు. నియోజకవర్గంలోనే కాదు, ఉమ్మడి జిల్లా పోలీసులు మొత్తం దాదాపుగా 98 శాతం పోలీసులు ప్రధాని పర్యటనకు వెళ్లిన విషయాన్ని స్థానికులు అందించిన ఉప్పు మేరకు తెలుసుకున్నారు. పోలీసుల పహారా కూడా లేదని గమనించి పకడ్బందీగా గణపతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లడానికి స్కెచ్ గీసి ఎత్తుకెళ్లారు. స్థానికుల సహకారంతోనే విగ్రహంను దొంగిలించారని, గతంలో సైతం చిన్న గణపతి విగ్రహాన్ని దొంగిలించుకుపోయారు. చోళుల కాలం నాటి పురాతన శంకరేశ్వర స్వామి దేవాలయంలో గుప్త నిధులు ఉన్నాయని తరచూ తవ్వకాలు జరుగుతున్నాయి. గుప్త నిధుల తవ్వకంలో పాల్గొన్న 30 ఏళ్ల క్రితం పాల్గొన్న నలుగురు పోలీసులు వివిధ రోగాలతో రక్తం కక్కుకుని చనిపోవడంతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఎన్నో కష్టాలనోర్చి చివరికి తిక్కపట్టి నాశనమయ్యారు. దానికి సహకరించిన కుటుంబాల్లో కూడా ముగ్గురు నలుగురు ఇప్పటికే మృత్యువాత పడ్డారు. మొత్తం 8 నుంచి 9 మంది గుప్త నిధుల తవ్వకం కోసం 30 ఏళ్ల క్రితం సదరు గుడిలో తవ్వి ప్రాణాలను కోల్పోయారు. ఆంజినేయులు ఎస్ఐగా ఉన్న సమయంలో గుప్త నిధుల తవ్వకం దారులపై కేసు నమోదైంది. మరోసారి కృష్ణమణి ఎస్‌గా ఉన్నప్పుడు మరోకేసు నమోదైంది. ఆ తవ్వకం సమయంలో పాము కనపడటంతో గుప్త నిధుల తవ్వకం దారులు అప్పట్లో పలాయనం చిత్తగించారు. ఇతర రాష్ట్రాల వారికి దేవాలయంపై కన్ను ఉంది. తరచూ ఆరు నెలలు సంవత్సరానికి గుప్త నిధుల కోసం తవ్వుతూనే ఉన్నారు. ఈ 400 కెజిలు, 4 అడుగుల ఎత్తు ఉన్న రాతి విగ్రహం కడుపులో వజ్ర వైడూర్యాలు ఒక అంచనాకు వచ్చిన తర్వాతనే ఆ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారని ప్రచారం జరుగుతోంది. పోలీసులు ప్రత్యేకమైన బృందాన్ని ఏర్పాటు చేసి దుండగులను త్వరలోనే పట్టుకోవాలని అగళి మండల ప్రజలు కోరుతున్నారు. విగ్రహాన్ని ఎత్తుకెళ్లడానికి గుప్త నిధుల తవ్వకం దారులు ఎంతో సాహసించారని, దీనిని ఛేదించి గుప్తంగా సమాచారాన్ని సేకరించి పట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలీసులకు ఇది ఒక సవాల్.

అక్కడ పదోన్నతులు స్పీడు... ఇక్కడ డీలా...!

మొదటిపేజీ తరువాయి... పదోన్నతులు పొందే వార్డెన్లు కోర్టులో కేసు పెట్టిన వార్డెన్ ను కలిసి కేసు వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆయన పెద్ద మనసుతో కేసు వెనక్కి తీసుకోవడం జరిగింది. అప్పుడు పదోన్నతులకు ఇక అడ్డంకులు తొలగిపోయాయని, తమకు పదోన్నతులు వస్తాయని వార్డెన్లు ఆశా భావం వ్యక్తం చేశారు. ఆ తర్వాత కూడా వార్డెన్లు పదోన్నతుల కోసం జిల్లా కలెక్టర్, డిడి లను కలిసి అర్జీలు ఇవ్వడం జరిగింది. పదోన్నతులకు సంబంధించిన ఫైలు నాలుగు రోజుల క్రితమే సిద్ధం అయ్యి డిడి టేబుల్ మీద ఉంది. కానీ డిడి గత మూడు రోజులుగా కార్యాలయానికి వెళ్ళకపోవడం, శనివారం సాయంత్రం ఐదు నిమిషాలు వచ్చి ఫైల్స్ చూడకుండా వెళ్లిపోవడం జరిగింది. ఆదివారం తో పాటు సోమవారం కూడా సెలవు కావడంతో ఇలా రోజురోజుకు ఫైలు పెండింగ్ పడుతూనే ఉంది. దీంతో పదోన్నతులు వస్తాయని వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్న వార్డెన్ల ఆశలు ఎప్పుడు నెరవేరుతాయో అర్థం కావడం లేదు. బీసీ సంక్షేమ శాఖలో పదోన్నతులు స్పీడు:బీసీ సంక్షేమ శాఖలో గ్రేడ్ 1 వార్డెన్ పదోన్నతులు స్పీడ్ గా జరుగుతున్నాయి. తాజాగా ముగ్గురు వార్డెన్లు కూడా గ్రేడ్ 1 పదోన్నతులు పొందారు. ఈ రెండు శాఖలకు ఒక్కరే డిడి అయినప్పటికీ తమ సొంత శాఖకు ఒక రకంగా, ఇన్చార్జి శాఖకు మరొక రకంగా ఎందుకు అలా చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వార్డెన్లు కలిసిన సమయంలో పదోన్నతులు ఇస్తామని డిడి చెబుతున్నారు. కానీ అందుకు సంబంధించిన ఫైలు తన టేబుల్ మీద గత మూడు రోజులుగా ఉన్నప్పటికీ ఫైల్ ను ఎందుకు చూడటం లేదు అర్థం కావడం లేదు. ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ.... పదోన్నతులు కల్పించడానికి అవకాశం ఉన్నప్పటికీ ఆ విధంగా శ్రద్ధ చూపకపోవడంతో వార్డెన్లు మరొకసారి జిల్లా కలెక్టర్ ను కలవడానికి సిద్ధమవుతున్నారు. దీనిపైన వివరణ అడగడానికి డిడికి వార్త రిపోర్టర్ ఫోన్ చేయగా... స్పందించలేదు.

అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్

పుట్టపర్తి (కలెక్టరేట్) , అక్టోబర్ 18, ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా అటువంటి వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ హెచ్చరించారు. టపాసుల విక్రయాలు జరిగే ప్రాంతాలలో పలు జాగ్రత్తలు, సూచనలు పాటించాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రమాదాలకు తావులేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ బాణాసంచా విక్రయించాలని విక్రయదారులకు తెలియజేయాలన్నారు. చట్టం సూచించిన నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. కేటాయించిన ప్రదేశాలలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని టపాసుల విక్రయాలు చేయాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. లైసెన్స్ లు కల్గిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా , అనుమతులు లేకుండా దీపావళి మందు గుండు సామాగ్రి కలిగి ఉన్నా, తయారుచేసినా లేదా అనధికార ప్రదేశాలలో నిల్వ ఉంచినా , విక్రయాలు జరిపినా అటువంటి వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. టపాసుల దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పని చేసి దీపావళి పండుగ సజావుగా నిర్వహించే విధంగా చూసుకోవాలన్నారు. దీపావళి పర్వదినం రోజున జిల్లా ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ 112 లేదా డయల్ 100 కి గాని లేదా సంబంధిత పోలీసు స్టేషన్ కు గాని సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

యోగ ఆసనాలు వేసిన జిల్లా కలెక్టర్

పుట్టపర్తి (కల్చరల్), అక్టోబర్ 18, ప్రభాతవార్త

యోగ ఆసనాలు వేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

శుక్రవారం రాత్రి బీసీ బాలుర సంక్షేమ హాస్టల్లో నిద్ర చేసిన జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, శనివారం ఉదయం పుట్టపర్తి లోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి యోగాసనాలు, వ్యాయామం చేశారు. ఈ సందర్భంగా యోగాసనాలు వ్యాయామం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి నిత్యజీవితంలో వాటిని భాగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని దీపశ్రీకి రాష్ట్ర ప్రథమ బహుమతి

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని దీపశ్రీ

ఆర్ట్స్ కళాశాల బి.ఎ.పొలిటికల్ సైన్స్ విద్యార్థిని దీపశ్రీ, సూపర్ సేవింగ్స్ సూపర్ జిఎస్‌టిపై జరిగిన వక్తృత్వ పోటీలో రాష్ట్ర ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా బహుమతిని అందజేశారు. వాణిజ్య శాస్త్ర, పొలిటికల్ సైన్స్ విభాగాల సిబ్బంది ఆమెకు ఈ విజయం వైపు మార్గనిర్దేశం, కీలక పాత్ర పోషించారు. ఈ సంతోషకరమైన సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సహదేవుడు, సిబ్బంది దీపశ్రీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలవడం, ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకోవడం విద్యార్థికి, కళాశాలకి చిరస్మరణీయమైన, ప్రతిష్టాత్మకమైన క్షణం అని పేర్కొన్నారు. ఈ విజయం కళాశాల విద్యా నైపుణ్యం, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది అని పేర్కొన్నారు.

సింగపూర్ ఫ్లోర్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిలకు..మంత్రి సత్యకుమార్యాదవ్ ఆర్థికసాయం

పోన్లో అభినందించిన మంత్రి

ధర్మవరంటౌన్, అక్టోబరు 18 ప్రభాతవార్త

అంతర్జాతీయ ఫ్లోరా బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిలను సన్మానించిన బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు

కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు ధర్మవరం బీఎస్ఆర్ బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు అని బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు తెలిపారు. తక్కువ సౌకర్యాల మధ్య కష్టపడి సాధన చేసి నవంబరులో సింగపూర్లో జరగనున్న అంతర్జాతీయ ఫ్లోర్ బాల్ పోటీలకు భారతజట్టులో స్థానం సాధించిన 10 మంది విద్యార్థినిలను శనివారం స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో హరీశ్ బాబు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఖిదృష్టికి హరీశ్ బాబు తీసుకెళ్లారు. దీంతో మంత్రిసత్యకుమార్ యాదవ్ ఫోన్ లో అంతర్జాతీయ పోటీలకు ఎంపికై సింగపూర్ కు వెళ్లనున్న విద్యార్థినిలను అభినందించి క్రీడలపట్ల చూపిన ఆసక్తి, కృషి పట్టుదలపై ప్రశంసలు కురిపించారు.. అంతేకాకుండా వారి ప్రయాణఖర్చుల కోసం రూ.5 లక్షలు సహాయం ప్రకటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ...మహిళా శక్తి.. యువశక్తి కలిసినప్పుడు భారత్ విజయాన్ని సాధించకుండా ఉండలేరన్నారు. భవిష్యత్తులో బాలికలు మరిన్ని అంతర్జాతీయ వేదికలపై భారత్ తరపున మెరిసేలా ఆశిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ లక్ష్మీనారాయణ, ఇన్చార్జ్ హెచ్ఎం దేవిప్రకాశ్, విద్యార్థినిల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ ప్రాజెక్టుతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచిత విద్యుత్-ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, అక్టోబర్ 18, ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ప్రధానమంత్రి సూర్య ఘర్ సోలార్ పవర్ ఏర్పాటుతో ఎస్సీ,ఎస్టీ వర్గాలకు ఉచిత రాయితీతో విద్యుత్తు సౌకర్యం కల్పించినట్లు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని సత్తెమ్మ దేవాలయం వద్ద పేద మధ్యతరగతి ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సూపర్ గిఫ్ట్ జిఎస్టి 2 అవగాహన సదస్సు సమావేశానికి మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి.విద్యుత్ ఎస్ ఈ సంపత్ కుమార్, పరిశ్రమల జిల్లా అధికారి నాగరాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ వల్ల అన్ని వర్గాల ప్రజలకు ఎంతో లాభదాయకమన్నారు.సూర్య ఘర్ సోలార్ పవర్ ఏర్పాటు చేసుకుంటే ఎస్సీ ఎస్టీ వర్గాలకు ఉచిత విద్యుత్తుతో అందజేస్తామని తెలిపారు. బీసీలకు ప్రభుత్వం రూ.20వేలు సబ్సిడీ ఇస్తామని తెలిపారు. ప్రతి ఇంటిపై సూర్య ఘర్ సోలార్ పవర్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ సూర్య ఘర్ సోలార్ ఏర్పాటుతో ప్రతి ఒక్కరికి విద్యుత్ బిల్లులు ఖర్చు తగ్గుతుందని సూచించారు. సూర్య ఘర్ పథకాన్ని పుట్టపర్తి నియోజకవర్గంలో ఒక మోడల్ గా తీసుకొని సుమారు పదివేల సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని మాజీ మంత్రి వెల్లడించారు.అనంతరం హారతి ఘాట్ వద్ద సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ ప్రజలతో కలసి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,ఆర్డీఓ సువర్ణ, కొత్తచెరువు మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్,విద్యుత్ ఎస్ ఈ సంపత్ కుమార్, పరిశ్రమల జిల్లా అధికారీ నాగరాజ,వెలుగు పిడి నర్సయ్య, విద్యుత్ శివకుమార్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ ,తహసిల్దార్ కళ్యాణ్, సీఐ శివాంజనేయులు, జిల్లా అధికారులు,కూటమి పార్టీల నాయకులు సామకోటి ఆదినారాయణ,గంగాధర్ నాయుడు, శ్రీరామ్ రెడ్డి,సుభాష్ చంద్ర, ముమ్మినేని వెంకటరాముడు, మహమ్మద్ రఫీ,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ ప్రభుత్వాన్ని నిలదీద్దాం, ప్రజా వైద్యాన్ని కాపాడుకుందాం

మాజీ మంత్రి సాకే శైలజనాథ్



సమావేశంలో మాట్లడుతున్న మాజీ మంత్రి సాకే శైలజనాథ్

బుక్కరాయసముద్రం అక్టోబర్ 18 ప్రభాతవార్త

పరిపాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న అసమర్థ కూటమి ప్రభుత్వాన్ని కోటి సంతకాల కార్యక్రమంద్వారా నిలదీద్దామని మాజీ మంత్రి శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ పిలుపునిచ్చారు.శనివారం బుక్కరాయసముద్రం మండల పరిదిలోని కొర్రపాడు, రోటరీపురం, రెడ్డిపల్లి, చెదుళ్ళ,నీలాంపల్లి గ్రామాల్లో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లడుతూ వైసీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తూ మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి కృషిచేశారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో చేసిన అభివృద్ధి కూటమి నాయకులకు కనిపించలేదా, అని ప్రశ్నించారు.జగన్మోహన్‌రెడ్డి పాలనలో రెండు సంవత్సరాలు కరోనా మహమ్మారితో రాష్ట్రం ఉక్కిరిబిక్కిరి అయినప్పటికీ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండ సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించారు. మరో మూడు సంవత్సరాల్లో ఇచ్చిన మాటప్రకారం సంక్షేమ పథకాలు అమలుచేశారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి పాలన పక్కన పెట్టి కక్షసాదింపు పాలన కొనసాగిస్తున్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ 17 మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేయడానికి సిద్ధపడిందని విమర్శించారు. ప్రజల సొమ్మును దోచుకుంటున్న ఈ కూటమి ప్రభుత్వనికి రాబోయే రోజుల్లో ప్రజలు సరైయిన గుణపాఠాలు చెప్పుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి,జడ్పిటీసీ నీలం భాస్కర్,బుక్కరాయసముద్రం పరిశీలకులు బొమ్మన శ్రీరామిరెడ్డి,రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు ముసలన్న, బండ్లపల్లి ప్రతాఫ్‌రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి గువ్వల శ్రీకాంత్‌రెడ్డి,సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, రాధమనోహర్‌రెడ్డి, నందినేని మల్లి,పురుషోత్తం,పూల నారాయణస్వామి, సర్పంచు పార్వతి,కాల్వ నారాయణ స్వామి, నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు సాకే లక్ష్మీనారాయణ,బిసి మండల అధ్యక్షులు చెరుకూరి నారాయణస్వామి, చెదుళ్ళ సర్పంచు శ్రీనివాసురెడ్డి, జంతులూరు సర్పంచు లక్ష్మిరెడ్డి,నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, మాజీ సర్పంచు ఉట్టి కాటమయ్య,అన్నేరి ఆదినారాయణ,రోటరీపురం గంగరాజు, నాగ,నాగరాజు, మల్లేసు,వడ్డె సత్తితోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సమాజంలో అనాగరికం..!

కుమారుడి వివాహ నిశ్చితార్థం చిత్రం (ఫైల్‌ఫోటో)

విలేఖరులతో మాట్లాడుతున్న బాధిత ఎంబీసీ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేష్

మొదటిపేజీ తరువాయి... బాధిత జోగి వెంకటేష్ నేను మన కులానికి చెందిన అమ్మాయితోనే నా కుమారుడికి పెళ్లి చేయాలనుకోవడం ఎలా తప్పవుతుందని పెద్ద మనుషులను ప్రశ్నించారు. ద